www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 24 ఏప్రిల్ 2023



ధాన్యం సేకరణలో ఇబ్బందుల్లేకుండా చర్యలు


రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ఉంగుటూరు:ధాన్యం సేకరణలో మండలంలో గోనె సంచులు, రవాణా సమస్యలు లేకుండా అధికార యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుందని తహశీల్దార్ ఎవి.రమణారావు తెలిపారు. ఆదివారం ఉంగుటూరు రైతు భరోసా కేంద్రం, ధాన్యం ఆరబోత ప్రాంతాలను ఆయన పరిశీలించారు . ఈ సందర్భంగా రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సంచులను, ధాన్యం బస్తాలు రవాణా చేసేందుకు లారీలను అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటి వరకూ మండలంలో 6.50 లక్షల గోనె సంచులు రైతులకు పంపిణీ చేశామన్నారు. 97 లారీల్లో 5240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు పంపించినట్లు చెప్పారు. సంచులు, లారీల సమస్య లేదన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులపై

రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం కొనుగోలుకు పూళ్లలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ధాన్యం రవాణా కోసం రైతుల అవసరాలకు సరిపోయే విధంగా వాహనాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆగ్రహంవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. ఏజెన్సీ పరిధిలోని పుంతరోడ్లపై రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం రవాణాకు సరిపోయే విధంగా వాహనాలు ఏర్పాటు చేయకపోవడంతో రెండు రోజుల క్రితం రైతులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు ఇచ్చిన హామీతో రాస్తారోకోను విరమించారు. కానీ ఆదివారానికి సైతం అధికారులు ఇచ్చిన హామీ అమలుకాకపోవడంతో రైతులు మరోసారి రోడ్లపైకి వచ్చారు. ఈ సందర్భంగా ఎపి. రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి సిపిఎం తరపున జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు మద్దతు తెలిపారు. ఈ నిరసనలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు బస్తాల్లో సిద్ధం చేశారన్నారు. ధాన్యం తరలింపునకు రవాణా సమస్యల ఏర్పడటంతో ధాన్యం రైతుల వద్దే ఉండిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని కోరారు. నూక శాతం పేరుతో డబ్బులు వసూలు చేయడం తగదని ఆయన పేర్కొన్నారు. రైతులను ఆదుకునేందుకు ఎకరాకు 110 నాణ్యమైన గోనె సంచులను అందజేయాలని ఆయన కోరారు. నూక శాతం పేర బస్తాకు రూ.80 నుంచి రూ.120 వరకూ వసూలు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, ఎపి కౌలు రైతుల సంఘ జిల్లా సమన్వయకర్త, సహాయ సమన్వయకర్త కొర్ని అప్పారావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తితో పాటు అధిక సంఖ్యలో రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.


ఉంగుటూరులో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న నాయకులు

సరిపడా లారీలు, గోనె సంచులు ఏర్పాటు చేయాలి

ఉంగుటూరు : రైతులకు, కౌలు రైతులకు ధాన్యం పట్టుబడులకు సరిపడా గోనె సంచులు ఇవ్వాలని, రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉంగుటూరు మండలంలోని కైకరంలో రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు పర్యటించి కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు మాట్లాడారు. రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా తెరవడం వల్ల అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన గోనెసంచులు, రవాణా, హమాలీలు వంటి సమస్యలను ముందస్తుగా పరిష్కరించడంలో అధికార యంత్రాంగం విఫలమైందని విమర్శించారు.

ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల అకాల వర్షాలకు అన్నదాతలు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం టార్పాలిన్లు సబ్సిడీపై అందించకపోవడం వల్ల వర్షం బారి నుండి ధాన్యాన్ని రక్షించుకునేందుకు టార్పాలిన్లు అందుబాటులో లేవన్నారు. ప్రభుత్వం స్పందించి రవాణాకు లారీలు ఏర్పాటు చేసి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన గోనె సంచులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కర్‌రావు, కౌలు రైతుల సంఘం జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, పలువురు కౌలు రైతులు, రైతులు పాల్గొన్నారు.

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు ప్రమాదకరం

సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి సభలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రమాదం నుండి దేశాన్ని కాపాడుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కె.మన్నవకృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార భేరి యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్‌ఆర్‌పేట పార్క్ వద్ద సిపిఐ, సిపిఎం ఏలూరు నగర కమిటీల ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, సిపిఐ నగర కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డేగా ప్రభాకర్, ఎ.రవి, మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. మోడీ, అమిత్‌షా నాయకత్వంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కూటమి ప్రజల మధ్య మతవిద్వేషాలు రాజేస్తున్నాయని విమర్శించారు. మరోవైపు అదానీ, అంబానీ వంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతున్నాయని విమర్శించారు. అనేకమంది త్యాగధనుల స్వతంత్ర్య పోరాట స్ఫూర్తితో బ్రిటిష్ వారిని ఎదిరించి సాధించుకున్న స్వాతంత్ర్యం పెను ప్రమాదంలో పడిందని, దాన్ని కాపాడుకోవడానికి ప్రజలు మరోసారి జాతీయోద్యమ స్ఫూర్తితో ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. బ్యాంకులు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, వాడరేవులు ఆఖరికి మనందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్ సంస్థలకు బిజెపి కట్టబెడుతుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అండదండలతో ఆదానీ ఏవిధంగా ప్రపంచాన్ని మోసం చేసి రూ.లక్షల కోట్లు కొల్లగొట్టినట్లు హిండెన్ బర్గ్ నివేదిక బయటపెట్టిందని గుర్తు చేశారు. దానిమీద విచారణకు అంగీకరించకుండా ఆదానీకి కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాయడాన్ని తప్పుబట్టారు. ఇంత జరుగుతున్నప్పటికీ అధానీ, అంబానీ తదితర కార్పొరేట్ సంస్థలకు దేశంలోని అడవులు, భూములు, విద్యుత్ ప్రాజెక్టులు, గనులు తదితర సంస్థలన్నీ కార్పొరేట్ సంస్థలకు అక్రమంగా కట్టబెడుతున్నారని విమర్శించారు. మరోవైపు పేదలపై, సామాన్య ప్రజలపై మోడీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోలు, డీజిల్, విద్యుత్ ఛార్జీలను పెంచి నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికులు స్వాతంత్ర్య కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లుగా మారుస్తోందని విమర్శించారు. విద్య, వైద్యం, సామాన్య ప్రజలకు అందని ద్రాక్షగా మారిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారుస్తోందని విమర్శించారు. ఎరువులు, పురుగుమందుల ధరలు పెంచి గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులు దివాళాతీసే పరిస్థితికి తీసుకవస్తున్నారన్నారు. మహిళలకు, దళితులకు, మైనార్టీలకు, గిరిజనులకు దేశంలో రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ఈ దుర్మార్గాలను, మతతత్వ కార్పొరేట్ కూటమి దుర్నీతిని ప్రశ్నించకపోతే దేశ లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోలేమన్నారు. మోడీ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశాయని, ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోను, వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు నిధులు, విశాఖ స్టీల్ ప్లాంట్ తదితర అనేక అంశాల్లో రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేస్తోందని విమర్శించారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి రాష్ట్రానికి నిధులు రాబట్టాల్సిన వైసిపి మోడీకి లొంగిపోయారని విమర్శించారు. అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం బిజెపి చెప్పినట్లు చెత్త సేకరణ, ఆస్తి పన్నులు, విద్యుత్ ఛార్జీలు తదితర భారాలను పెంచుకుంటూ పోతుందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలైన తెలుగుదేశం, జనసేనలు బిజెపిని నిలదీయడం లేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సిపిఐ, సిపిఎం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై అంబేద్కర్ జయంతి రోజు నుండి మేడే వరకూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరచడానికి ప్రచార భేరి యాత్రలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా నాయకులు బి.సోమయ్య, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సెక్రటరీ బండి వెంకటేశ్వరరావులు మాట్లాడారు. ఈ సభలో సిపిఎం జిల్లా కమిటీ నాయకులు కె.శ్రీనివాస్, ఎ.శ్యామలారాణి, పి.ఆదిశేషు, నగరనాయకులు, బి.సాయిబాబు, జి.రవికిషోర్, కె.రామాంజనేయులు, గోపి, సిపిఐ నాయకులు కడుపు కన్నయ్య, ప్రసాద్, సుబేదార్ ఖాన్, కొండేటి రాంబాబు, కొండేటి బేబీ, ఎం.విజయ, లోకేష్, తెరలాపు శ్రీను, రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఏలూరు సభలో అభివాదం చేస్తున్న నేతలు


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

నిర్వాసితులను పట్టించుకోరా

కుక్కునూరు:ఏళ్లు గడుస్తున్నా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం ఊసేలేదని, వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప నిర్వాసితుల కష్టాలు తీరడం లేదని, ఓ వైపు నిర్వాసితులను త్యాగధనులని కీర్తిస్తూనే నిర్వాసితును పట్టించుకోరా అని సిపిఎం, సిపిఐ నేతలు ప్రభుత్వ తీరును విమర్శించారు. బిజెపిని గద్దెదించుదాం.. దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన చేపట్టిన రాజకీయ ప్రచారభేరి యాత్ర ఆదివారం మండలంలోని సీతారామనగరంలో ప్రారంభమైంది. శ్రీధర, వేలేరు, వెంకటాపురం, అల్లిగూడెం, బోనగిరి, బంజరుగూడెం, అమరవరం, రాజీవ్‌నగర్, ఉప్పేరు, దామరచర్ల, పెదరావిగూడెం, చీరవల్లి గ్రామాల్లో సాగింది. బిజెపి అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రతీ గ్రామంలో ప్రజలను చైతన్యం చేస్తూ మోడీ చేసే వ్యతిరేక పనులను వివరిస్తూ యాత్ర సాగింది. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారీ మాట్లాడుతూ గత పదేళ్లుగా పూర్తి స్థాయిలో ఏ ఒక్క నిర్వాసితుడికీ పరిహారం చెల్లించకుండా గాలికొదిలేసి పోలవరం ముంపు పేరుతో రోడ్లు, విద్యావైద్యం, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు పట్టించుకోకుండా నిర్వాసితుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సర్వేల పేరుతో నిర్వాసితులను అయోమయానికి గురిచేయడం సరికాదని, నేటికీ పూర్తి పునరావాస పరిహారపు జాబితా ప్రకటించకపోతే పరిహారం ఎలా చెల్లిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణం నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించి కలనీలకు తరలించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా, గ్యాస్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలను అమాంతం పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపిందన్నారు. కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. మోదీ ప్రభుత్వతీరును ప్రజలకు వివరిస్తూ బిజెపిని గద్దెదించి, దేశాన్ని కాపాడుకునేందుకు ఈ ప్రచార యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాత్రలో సిపిఎం నాయకులు యర్రం సాయికిరణ్, వలీ పాషా, రమేష్, మోహనరావు, సిపిఐ నాయకులు కొన్నే లక్ష్మయ్య, వరకా శ్యామల, వరసా నాగేశ్వరరావు, వి.నరసింహారావు, రమణయ్య పాల్గొన్నారు.


కుక్కునూరులో..

ముదినేపల్లిలో వర్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం పది గంటల సమయంలో వర్షం పడింది. వేసవిలో విద్యుత్ కోతలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజానీకం వర్షానికి ఊరట చెందారు. అకాల వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. దీంతో మండల ప్రజలు ఉపశమనం పొందారు. దీంతో వృద్ధులు, పిల్లలు, రోగులు వేసవితాపం నుంచి సేదదీరారు.


భూమిపూజ చేస్తునన ఎంఎల్ఎ

వాలంటీర్లతో గ్రామసభల నిర్వహణ సిగ్గుచేటు

అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం

ప్రజాశక్తి - పోలవరం

'అధికారులు హాజరుకాని గ్రామసభలు ఎందుకు.. అలాంటి సభల వల్ల ప్రజలకు ఉపయోగం ఉండదు.. వాలంటీర్లతో గ్రామ సభలు నిర్వహించడం సిగ్గుచేటు' అంటూ పోలవరం పంచాయతీ పాలకవర్గ సభ్యులు తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల తూతూమంత్రంగా నిర్వహించిన గ్రామసభనుద్దేశించి పోలవరం పంచాయతీ పాలకవర్గ సభ్యులు మంగిన కొండ, మంగిన పోసిరత్నం, మేడుం పార్వతి, పట్నాల దేవి తదితరులు ఆదివారం మాట్లాడారు. పోలవరం మండలంలో గ్రామపంచాయతీల్లో నిర్వహించే గ్రామ సభలకు అధికారులు సరిగా హాజరుకావడం లేదని, పంచాయతీలో సమస్యలపై సమాధానం చెప్పేందుకు ఏ ఒక్క అధికారీ ఉండకపోవడం వల్ల గ్రామసభలు ఉపయోగకరంగా ఉండడం లేదన్నారు. అంబేద్కర్ జయంతి రోజున పోలవరం పంచాయతీలో గ్రామసభ నిర్వహించారని ఆ గ్రామ సభలో అధికారులెవరూ పాల్గొనకపోవడం వల్ల వాలంటీర్లు మాత్రమే గ్రామ సభను తూతూమంత్రంగా నిర్వహించారన్నారు. పంచాయతీలో డ్రెయినేజీలు, ఉపాధి హామీ పనులు, గృహ నిర్మాణ పథకం, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎవరూ పాల్గొనకపోవడం వల్ల సంబంధిత వివరాలు చెప్పేవారు లేకుండా పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలను వాలంటీర్లతో నిర్వహించేందుకు చూస్తున్నారని విమర్శించారు. పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరగాలన్నా, పంచాయతీ అభివృద్ధిపథంలో పయనించాలన్నా గ్రామసభలు చిత్తశుద్ధితో నిర్వహించాలని, సంబంధిత అధికారులు గ్రామసభలో పాల్గొనాలని కోరారు.

అంబేద్కర్ విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కైకలూరు

అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ అన్నారు. ఆదివారం వారు ఆటపాక శివారు జాన్‌పేటలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, బుద్ధ విహార్ భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు ఎంపిపి అడవి వెంకటకృష్ణ మోహన్, ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, ఆటపాక గ్రామ సర్పంచి తలారి మణి, ఎంపిటిసి సభ్యులు పట్టపు బాలమ్మ, తమ్మిశెట్టి లక్ష్మి, కైకలూరు గ్రామ సర్పంచి డిఎం నవరత్నకుమారి, వరాహపట్నం సర్పంచి ఉప్పలపాటి నాగమణి, చిన్నతాడినాడ సర్పంచి గండికోట ఏసుబాబు, సర్పంచుల ఫోరం మండవల్లి మండల అధ్యక్షులు బేతపూడి ఏసేవ్ రాజు, తులసి పూర్ణ, నవయాన్ బుద్ధిష్ట్ సొసైటీ వ్యవస్థాపక డైరెక్టర్ వంగలపూడి విజయ్ కుమార్, అధ్యక్షులు తలారి జాన్, కోశాధికారి పాణెం కిరణ్ బాబు, కార్యదర్శి కుమ్మరిగుంట మదన్, డైరెక్టర్లు కూనవరపు సతీష్ పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని తాడువాయి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కాటన్ దొర హాస్పటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు ఎం.ఆంజనేయులు రోగులకు పరీక్షించి కావాల్సిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, విష జ్వారాలకు పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్‌కు టెస్ట్‌లు నిర్వహించి తగిన మందులు ఉచితంగా అందించారు. సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని స్థానిక పాస్టర్ కె.శైలేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ చైతన్య, కాలనీ అధ్యక్షులు గిల్లా వెంకటేశ్వర్లు, వైసిపి యూత్ అధ్యక్షులు బద్దె ప్రేమ్ కుమార్ ,పెరుమాళ్ నరసింహారావు, అభి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు

శిశువు మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక పద్మ థియేటర్ సమీపంలోని లచ్చిరెడ్డిచెలకలో శిశువు మృతదేహాన్ని స్థానికులు ఆదివారం ఉదయం గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు నవజాత మగశిశువును కాలువలో పడేసి వెళ్లారు. స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శిశువు మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిద్రలోనే దోచేస్తారు..!

వేసవిలో వెంటాడుతున్న దొంగల భయం
ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోవాలని పోలీసుల సూచన

ప్రజాశక్తి - మండవల్లి

వేసవి అంటేనే ప్రజలకు దొంగల భయం వెంటాడుతుంది. ఇంటిలో ఉక్కబోతతో ఆరు బయట నిద్రకు ఉపక్రమించినా, ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇళ్లకు వెళ్లినా దొంగలు ఇదే అదునుగా భావించి చోరీలకు పాల్పడుతుంటారు. నేపథ్యంలోనే మండలంలో వేసవిలో ఎక్కువ దొంగతనాలు జరిగాయి. లక్షలాది రూపాయల నగదు, బంగారం, వెండిని దొంగలు అపహరించుకుపోయారు. కొన్నిరోజుల క్రితం మండవల్లి ఎస్‌సి కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటిలోకి దొంగలు చొరబడి సుమారు రూ.నాలుగు లక్షల విలువచేసే బంగారు, వెండి నగలతో పాటు నగదును అపహరించుకుపోయారు. అలాగే తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లల్లోకి దొంగలు ఒకేరోజు రాత్రి చోరీకి పాల్పడి సుమారు రూ.ఆరు లక్షల విలువ చేసే బంగారు, వెండి నగలతో పాటు నగదును అపహరించుకుపోయారు. పోలీసునంటూ వాహనపత్రాలు చూపించాలని ద్విచక్ర వాహనదారుణ్ని ఆపి పట్టపగలే లక్ష రూపాయలు విలువచేసే బంగారు గొలుసును దొంగలించిన ఘటన కూడా మండలంలో చావలపాడలో చోటుచేసుకుంది. ఇలా వేసవి కాలంలో దొంగలు రెచ్చిపోయి దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేసవికాలంలో ఇంటికి తాళం పెట్టి బంధువుల ఇళ్లకు వెళ్లి ఒక్క పూట నిశ్చింతగా ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి.



సాధారణంగా వేసవిలో విహారయాత్రలకు, బంధువుల ఇళ్లకు ఎక్కువగా వెళ్తుంటారు. వేసవి సెలవులకు వెళ్లే క్రమంలో తమ విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఇంటిలోనే ఉంచి తాళం పెట్టి ఊర్లకు వెళుతుంటారు. ఇదిలా ఉంటే వేసవిలో ఇంటిలోకి గాలి రావడంలేదని, ఉక్కబోతగా ఉంటుందని సేద తీరడానికి డాబాలపైన, లేదా తలుపులు బార్లా తీసి ఆదమరిచి మత్తుగా నిద్రపోతుంటారు. ఇదే అదునుగా భావించి దొంగలు చోరీలకు పాల్పడుతుంటారు. పగటిపూట రెక్కీ నిర్వహించి తాళం వేసి ఉన్న ఇళ్లను, ఆదమరిచి నిద్రిస్తున్న వారి ఇళ్లను టార్గెట్ చేసి గుట్టుచప్పుడు కాకుండా దొంగతనానికి పాల్పడుతున్నారు. నిద్రలేచే సమయానికి దొంగలు ఇల్లంతా గుల్ల చేశారని గమనించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అయితే వేసవిలో చోరీల నియంత్రణకు పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. అంతేకాకుండా ఊరి శివారులో నివసించే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తూనే ఉన్నారు.

లాక్డ్‌హౌస్ మోనటరింగ్ సిస్టంతో చోరీలకు చెక్

చోరీలకు చెక్ పెట్టే విధంగా పోలీసులు లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను అందుబాటులోకి తీసుకొచ్చారు. సమాచారం అందిస్తే ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను అమర్చి కంటికి రెప్పలా కాపాడుతామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఈ సిస్టమ్‌ను వినియోగించుకుంటే ఇంటికి భద్రత ఉంటుందని చెబుతున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోండి

లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టం చోరీలు జరగకుండా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. చోరీలకు అడ్డుకట్టు వేసే విధంగా పోలీస్ శాఖ ఈ విధానం తీసుకొచ్చిందన్నారు. ప్రజలు ఊర్లకు వెళ్లే క్రమంలో విలువైన వస్తువులను జాగ్రత్తపరచుకోవాలన్నారు. ఇంటికి తాళం పెట్టి వేరే ప్రాంతాలకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమాచారం అందిస్తే లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం అమర్చి దొంగతనం జరగకుండా కంటికి రెప్పలా కాపాడుతామని చెప్పారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలో పగలు, రాత్రి వేళల్లో కూడా పోలీసులతో గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏదైనా ఆపద, అత్యవసర సమయాల్లో పోలీసులకు లేదా 100, 112 నెంబర్లకు సమాచారం అందించి సహాయం పొందొచ్చన్నారు. అవగాహన లేకపోవడం వల్ల ఈ సిస్టమ్‌ను చాలామంది వినియోగించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలోనే చోరీలు పెరుగుతున్నాయన్నారు. ఈ సిస్టం వినియోగించుకోవడానికి ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచితంగా అమరుస్తున్నామని తెలిపారు. చోరీలకు అడ్డుకట్ట వేయడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి పిరికిపందల చర్య : టిడిపి

ప్రజాశక్తి - పోలవరం

ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో టిడిపి అధినేత చంద్రబాబు కాన్వాయ్‌పై దాడి వైసిపి ప్రభుత్వ పిరికిపంద చర్య అని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ విమర్శించారు. ఆదివారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి ప్రభుత్వ అరాచక పాలనలో విసిగివేశారిన ప్రజలు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని, అందుకే రాష్ట్రంలో చంద్రబాబు బహిరంగ సభలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. చంద్రబాబుకు పెరుగుతున్న జనాదరణను చూసి ఓర్వలేక పరోక్షంగా దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతకు భద్రత కల్పించడంలో వైసిపి పూర్తిగా విఫలమైందన్నారు. అధికార పార్టీ చేస్తున్న అరాచకాలను, దాడులను రాష్ట్ర ప్రజానీకం గమనిస్తుందని, రానున్న ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్‌పై, దాడిలో పాల్గొన్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుపై దాడిలో ప్రేక్షక పాత్ర వహించిన పోలీసుల చర్యలను ఆయన ఖండించారు.

పట్టెన్నపాలెం బ్రిడ్జి నిర్మించాలని టిడిపి సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పట్టెన్నపాలెం బ్రిడ్జిని నిర్మించాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు అధికార వైసిపి ప్రజా ప్రతినిధులకు సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఆదివారం మండలంలోని పట్టెన్నపాలెం జల్లేరుపై అసంపూర్తి నిర్మాణంలో ఉన్న వంతెనను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ సెల్ఫీ దిగి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం పట్టెన్నపాలెం వంతెనకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించిందని తెలిపారు. ఎన్నికల కోడ్ వల్ల నిలిచిన పనులు ప్రభుత్వం మారిన నేపథ్యంలో బ్రిడ్జికి మురసలంపట్టి నేటికీ పూర్తి కాలేదని ఏద్దేవ చేశారు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, ఈ ప్రాంతంలో ప్రముఖ క్షేత్రం గుబ్బల మంగమ్మ తల్లి దేవాలయం ఉండడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది వాహనాల్లో ఆలయాన్ని దర్శించుకుంటారని తెలిపారు. అలాంటి ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయకపోవడం బాధాకరమన్నారు. టిడిపి సెల్ఫీ ఛాలెంజ్‌ని సవాలుగా తీసుకుని వంతెన నిర్మాణం పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్‌చంద్రశేషు


మేడే జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. ద్వారకాతిరుమల రామాలయం వద్ద సిఐటియు మండల కమిటీ సమావేశం సుబ్బారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. వాటి వల్ల కార్మికులు అన్ని హక్కులు కోల్పోయి బానిసలుగా పని చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని హక్కు కోసం మేడే స్ఫూర్తితో మరోసారి పోరాటం చేయాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వ విధానాలతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు అల్లాడుతున్నారన్నారు. మేడే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మేడే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఆది కృష్ణ, మండల నాయకులు మధు, పేరయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఐసిఎఆర్ డ్రోన్ పైలెట్‌గా రమేష్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


సర్టిఫైడ్ పైలెట్ లైసెన్స్ అందుకుంటున్న రమేష్

ఐసిఎఆర్ సంస్థలో తొలి సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్‌గా జీలుగుమిల్లి సిటిఆర్ఐ అసిస్టెంట్ ఫామ్ మేనేజర్‌గా పని చేస్తున్న టి.రమేష్ ఎంపికైనట్లు సిటిఆర్ఐ సంస్థ వారు తెలిపారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వారు పూణెలో నిర్వహించిన రాత పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి ఐసిఎఆర్ తరపున తొలి సర్టిఫైడ్ పైలెట్ లైసెన్స్‌ను పొందినట్లు తెలిపారు. ఐసిఎఆర్ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ విధానంలో శాస్త్ర సాంకేతికను రైతులకు అందించే విధానంలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగానికి పైలెట్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండేలా ఆదేశాల ప్రకారం పిసిబి ఎరో హబ్‌లో శిక్షణ పొంది పైలెట్ లైసెన్స్‌ను పొందినట్లు రమేష్ తెలిపారు. పైలెట్‌గా ఎంపికైన రమేష్‌కు సిటిఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు, మాధవ్, సిటిఆర్ఐ హెడ్ సుబ్బయ్య, ఫామ్ మేనేజర్ జయకృష్ణ, పలువురు రైతులు అభినందనల తెలిపారు.


రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వెంకట ప్రతాప్ అప్పారావు

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పాత రావిచెర్ల నుంచి మెర్సపూడికి రూ.3.50 కోట్లతో వ్యయంతో నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణ పనులను ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే చుట్టుపక్కల పలు గ్రామాల ప్రజలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పనులను కాంట్రాక్టర్ త్వరితగతిన పూర్తి చేసి రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మించాలని సూచించారు.


జగన్ హయాంలోనే సంక్షేమం : డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

సంక్షేమానికి చిరునామా సిఎం జగన్ పాలన అని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు(డిఎన్ఆర్) అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో ఆదివారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం అధికారులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ జగన్ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రతీఇంటికి అందిన పథకాలను వారికి తెలియజేశారు. అనంతరం డిఎన్ఆర్ మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన పథకాలే రానున్న ఎన్నికల్లో జగన్‌ను మరలా అధికారంలోకి తీసుకువస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్‌ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధా, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, పార్టీ శ్రేణులు నిమ్మగడ్డ భిక్షాలు, బేతపూడి వెంకటరమణ టి.రాజేష్, కె.విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, జి.వరప్రసాద్, ఈడే చిన్నా, సాక్షి సాయి, రాచూరి కుమార్, దివి సతీష్, శీలం రామకృష్ణ, గంటా కోటేశ్వరరావు, కె.ప్రవీణ్ పాల్గొన్నారు.

చినవెంకన్న నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


దాతకు బాండ్‌ను అందిస్తున్న అలయ అధికారి

ద్వారకాతిరుమల చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు కృష్ణా జిల్లా నిమ్మతోట, బేతవోలుకు చెందిన తుర్లపాటి హరిప్రసాద్ ఆదివారం రూ.50,400 విరాళం దేవస్థానం ఎఇఒ మెట్టపల్లి దుర్గారావుకు అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు విరాళానికి సంబంధించిన బాండ్‌ను అందించారు.

ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదగొన్నూరులో గ్రామ పంచాయతీ, విజయవాడ మెడ్‌స్టార్ హాస్పటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు విజయ, న్యూరాలజిస్ట్ లంక గౌతమ్‌ముఖేష్, పల్మనాలజిస్ట్ ఉదయ్‌కిరణ్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కారక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గ్రామ సర్పంచి తాడంకి శిరీష, పార్టీ మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, వైసిపి నాయకులు టి.రాజేష్, కె.గోవిందరాజులు, అల్లూరు, కొరగుంటపాలెం సర్పంచులు శీలం రామకృష్ణ, పేరే రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు శ్రవణం పూర్ణచంద్రరావు, సాక్షి సాయి, నాగరాజు పాల్గొన్నారు.

నిమ్మలగూడెంలో 'జనంలోకి జనసేన'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని నిమ్మలగూడెంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని ఆ పార్టీ నేతలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మేకా ఈశ్వరయ్య, మండల నాయకులు, గ్రామంలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ముఖ్యమంత్రిగా ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీని అధిక ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే ఆరు నెలల కాలంలో హామీలు అమలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శొంఠి వీరాస్వామి, బండారు చిన్ని, దాకారపు ప్రసాద్, గేలం నాగరాజు, చక్రి, ధర్మరాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి - కైకలూరు

మాజీ ఎంపిటిసి సభ్యులు, టిడిపి నేత గురజాల విశ్రాంతమ్మ ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆటపాక శివారు జాన్ పేటలోని ఆమె నివాసం వద్ద పార్థివదేహానికి ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, టిడిపినాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

గడ్డి, ఊకలోడు వాహనాలతో ట్రాఫిక్ కష్టాలు

వాహనదారుల ఇక్కట్లు
పట్టించుకోని పోలీసులు


ముదినేపల్లిలో గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్


ప్రజాశక్తి - ముదినేపల్లి

వరిగడ్డి, ఊక లోడు లారీలతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. సమయపాలన లేకుండా వరిగడ్డి, ఊకలోడు లారీలు, ట్రాక్టర్లు రోడ్లపై రాకపోకలు సాగిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రధాన కూడలిల్లో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో వాహనదారులకు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇటీవల వరిగడ్డికి బాగా డిమాండ్ ఏర్పడడంతో వరిగడ్డి వ్యాపారం బాగా సాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆక్వా సాగు కారణంగా వరిగడ్డికి కొరత ఏర్పడింది. ఆక్వా సాగు జిల్లాలో విస్తరించడంతో కొల్లేరు తీరప్రాంతాల్లో వరిగడ్డి అవసరం బాగా పెరిగింది. ఆక్వా చెరువుపై కాపల ఉండే పశు పోషకులకు వరిగడ్డి అవసరం బాగా ఉంది. పశువులకు వరిగడ్డి అవసరం ఎక్కువగా ఉండడంతో గడ్డికి గిరాకీ పెరిగింది. దీంతో కృష్ణా జిల్లా నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు నిత్యం ట్రాక్టర్లు, లారీల్లో వరిగడ్డి రవాణా చేస్తున్నారు. గడ్డి లారీలు , ట్రాక్టర్లు ముదినేపల్లి మండలం నుంచే ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోకి ప్రవేశించాలి. మండలంలో ప్రధానంగా సింగరాయపాలెం, ముదినేపల్లి సెంటర్ల నుంచి వరిగడ్డి లోడు లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా గడ్డిలోడు లారీలు, ట్రాక్టర్లు రోడ్లపై వెళ్తుండడంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. సింగరాయపాలెం, ముదినేపల్లి సెంటర్లల్లో తరచూ గడ్డి వాహనాలతో ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఉదయం ఆరు గంటలలోపు, రాత్రి పది గంటల తర్వాతే ఊక, వరిగడ్డిలోడు వాహనాలు రోడ్లపై రాకపోకలు సాగించాలి. కాని ఉదయం పది గంటలు, సాయంత్రం నాలుగు గంటలు, మధ్యాహ్నం రెండు గంటల సమయాల్లో రోడ్లు ఎక్కడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వాహనాల పరిమితికి మించి గడ్డిని, ఊకను లోడు చేయడంతో వాహనం రెండు వైపుల రోడ్డు మొత్తం ఆక్రమిస్తోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర పెద్ద వాహనాలు గడ్డి వాహనాన్ని తప్పుకోవాలంటే అనేక ఇక్కట్లు పడుతున్నారు. దీంతో తరచూ వాహనచోదకులు, వ్యాపారులు, వివిధ పనులపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఓవర్‌లోడు కారణంగా పలుసార్లు వరిగడ్డి, ఊక లోడు లారీలు, ట్రాక్టర్లు విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నాయి. వాహనాల్లో పరిమితికి మించి గడ్డిని, ఊకను లోడు చేయడంతో విద్యుత్ తీగలు ఎత్తు తక్కువ ఉన్న చోట వాహనాలపై ఉన్న వరిగడ్డి విద్యుత్ తీగలకు అంటుకోవడంతో లారీలు, ట్రాక్టర్లు కాలి బూడిదై ఆస్తి నష్టం జరిగిన సంఘటనలు మండలంలో అనేకం ఉన్నాయి. గతంలో మండలంలోని పెదపాలపర్రులో వరిగడ్డి లారీ, వణుదుర్రులో వరిగడ్డి ట్రాక్టర్లకు విద్యుత్ తీగలు తగిలి గడ్డికి నిప్పంటుకుని ప్రమాదాలు సంభవించాయి. ఇంత జరుగుతన్నా పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అధిక లోడుతో సమయపాలన లేకుండా నిబంధనలకు విరుద్ధంగా రోడ్లు ఎక్కుతున్న ఊక, గడ్డి లోడు లారీలు, ట్రాక్టర్లను నియంత్రించడంలేదు. వాహనదారులకు జరిమానాలు విధించడంలేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పరిమితికి మించి, నిబంధనలకు విరుద్ధంగా, సమయపాలన లేకుండా రోడ్లపై రాకపోకలు సాగించే గడ్డి, ఊక లోడు వాహనదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు వారికి జరిమానాలు కూడా విధించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో పోలీసులను కోరుతున్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి 'మానవత' కృషి

ప్రజాశక్తి - భీమడోలు


మానవత భీమడోలు శాఖ సమావేశంలో సభ్యులు

ప్రతిభ గల పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు, ఆదుకునేందుకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ మానవత సేవలు అభినందనీయమని పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. మానవత భీమడోలు శాఖ నెలవారీ సమావేశాన్ని పొలసానిపల్లిలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమడోలు శాఖ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సర్పంచితో పాటు మానవత సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచి మాట్లాడుతూ మానవత సంస్థ వివిధ సామాజిక తరగతులకు చెందిన ప్రజలు తమ మనోభావాల మేరకు ఆప్తుల అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు మానవత సంస్థ ఏర్పాటుచేసిన శాంతి రథాలు అందిస్తున్న సేవలు మంచి గుర్తింపును పొందాయన్నారు. ఈ నేపథ్యంలో వారు చేస్తున్న సేవలకు స్పందించిన తనతో పాటు, తన కుటుంబ సభ్యులు సంస్థ సభ్యులుగా చేరామన్నారు. ఇదే క్రమంలో గ్రామంలో ప్రస్తుతం 45 మంది ఉన్న సభ్యుల సంఖ్యను వంకు పైగా పెంచేందుకు కృషి చేస్తాన న్నారు. భీమడోలు కేంద్రంగా మానవత భీమడోలు శాఖ నిర్మించనున్న కార్యాలయ భవనా నికి తమ కుటుంబ సభ్యుల తరపున రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఇదేవిధంగా భవన నిర్మాణానికి చిలపర్తి రామారాయుడు రూ.ఐదు వేల ఆర్థిక సాయం, మిరియాల సత్యనారాయణ వెయ్యి రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించారు. వారితో పాటు ఇదే రీతిలో ఆర్థిక సహాయాన్ని త్వరలో ప్రకటిస్తానని హామీ ఇచ్చిన ఆధ్యాత్మిక వేత్త కృష్ణప్రసాద్‌లను అభినందించారు. మరొక ముఖ్యఅతి థిగా పాల్గొన్న మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ మానవత సంస్థ ఇబ్బందుల్లో ఉన్నవారిని ఓదార్చటం, ఆదుకోవడం తమ వంతు కర్తవ్యంగా ఆచరిస్తుందన్నారు. ప్రస్తుతం నిర్వహి స్తున్న నెల వారీ సమావేశంలో మే ఒకటో తేదీ నుంచి వేసవి దృష్టిలో ఉంచుకొని భీమడోలు జంక్షన్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్స రానికి భీమ డోలు శాఖ నూతన అధ్యక్షులుగా వట్టి సుగుణాకర్‌ను సభ్యులు ప్రతిపాదించారన్నారు. మానవత సంస్థ శాంతి రథాల ఈ కార్యక్రమంలో విభాగం జిల్లా ఛైర్మన్ అప్పక రాంబాబు, సంస్థ గ్రామ కన్వీనర్లు డి.రాజేష్, ప్రసాద్, ఎం.రమేష్, గోపాలకృష్ణ, మండల శాఖ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీలక్ష్మీనారాయణ ఫౌండేషన్ క్రికెట్ టోర్నమెంట్

విన్నర్‌గా భీమడోలు పవర్ బోయ్స్ జట్టు
రన్నర్‌గా పూళ్ల వారియర్స్ టీమ్


టోర్నమెంట్ విన్నర్ భీమడోలు జట్టు

ప్రజాశక్తి - ఉంగుటూరు

క్రీడాకారుల్లో అంతర్గత ప్రతిభా పాటవాలను వెలికి తీయడంతో పాటు యువత దృష్టి చెడు మార్గాల వైపు మరలకుండా, మనసిక ఉల్లాసానికి ఆటల పోటీలు ఎంతో దోహదం చేస్తాయని శ్రీలక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఛైర్మన్, జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ బాధ్యుడు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం కూడా నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ నెల 14 నుంచి జరగుతున్న పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాల నుంచి 39 జట్లు పాల్గొన్నాయి. లీగ్‌కమ్ నాకవుట్‌లో పద్ధతిలో జరిగిన ఈ పోటీల్లో భీమడోలు పవర్ బాయ్స్, వెర్సెస్ పూళ్ల వారియర్స్ జట్లు తలపడ్డాయి. భీమడోలు జట్టు టోర్నీ విజేతగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. గతేడాది టోర్నమెంట్‌లో కూడా భీమడోలు విన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విన్నర్ జట్టుకు ట్రోపీతో పాటు రూ.50 వేలు ఫౌండేషన్ ఛైర్మన్ ధర్మరాజు అందించారు. రన్నర్ జట్టుకు రూ. 25 వేలు, మూడో స్థానం పొందిన జట్టుకు రూ.15 వేలు, ఉత్తమ బ్యాట్స్‌మెన్, బౌలర్స్, కీపర్‌లకు కూడా నగదు బహుమతులతో పాటు ట్రోపీ జ్ఞాపికలను అందించారు. లక్ష్మీనారాయణ ఫౌండేషన్ సభ్యులు పొతూర్తి కృష్ణంరాజు, చింతలపాటి బాసిరాజు, వంగా రఘు, జనసేన నాయకులు, సైనసైనికులు పాల్గొన్నారు.

110 పరుగులతో భీమడోలు విజేత

ఫైనల్ పోటీలో భీమడోలు - పూళ్ల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన భీమడోలు నిర్ణీత ఓవర్లకు 143 పరుగులు చేసింది. అనంతరం పూళ్ల జట్టు 33 పరుగలకే ఆల్‌అవుట్ ఆయింది. 110 పరుగుల భారీ ఆధిక్యంలో భీమడోలు తన సత్తాను చాటింది.



ప్రమాదకరంగా విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని కైకలూరు రోడ్డులో ఉన్న పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీలోని రెండో బజారులో విద్యుత్ స్తంభానికి అమర్చిన విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ ప్రమాదకరంగా ఉంది. స్తంభానికి ఐదు అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ కేవలం భూమికి రెండు అడుగుల ఎత్తులో ఉంది. నిత్యం ఈ స్తంభం వద్ద కాలనీ పిల్లలు ఆడుకుంటూ ఉంటారు. పిల్లలు ఏమాత్రం ఏమరుపాటున విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ వద్దకు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ఫ్యూజ్‌బాక్స్ స్థంభానికి ఎత్తులో ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కళాకర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో శ్రీఖ్యాతికి స్థానం

ప్రజాశక్తి - చింతలపూడి



కళాకర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్ లైన్ జూమ్ కాంపిటీషన్‌లో లింగపాలెం గ్రామానికి చెందిన ఎం.సుబ్బారాయుడు మనవరాలు శ్రీఖ్యాతి పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి కళాకర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాధించింది. కేవలం తొమ్మిది నిమిషాల్లో 20 పద్యాలు ఆలపించి ఔరా అనిపించింది శ్రీఖ్యాతి ఏడు సంవత్సరాల వయస్సులో ఇంత చక్కగా పద్యాలు, పాటలు, త్యాగరాజకీర్తనలు ఆలపిస్తూ అందరినీ ఆశ్చర్యచకితులను చేస్తుంది. అంతేకాకుండా రెండేళ్లుగా అనేక కాంపిటీషన్స్‌లో పాల్గొని ఉత్తమ బహుమతులు అందుకుంది. అతిచిన్న వయసులోనే ఒకవైపు చదువు, మరోవైపు కాంపిటీషన్స్‌లో పాల్గొనడం ఆ చిన్నారి కృషి, పట్టుదలకు నిదర్శనమైతే ఆ చిన్నారిని ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులపై ప్రశంసలు కురిపిస్తున్నారు స్థానికులు. శ్రీఖ్యాతి మరెన్నో కాంపిటీషన్స్‌లో పాల్గొని మంచి గుర్తింపు పొందాలని, ఉత్తమ బహుమతులు అందుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

జయమంగళకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి - కైకలూరు

ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణను ఆదివారం పలు సంఘాల నేతలు అభినందించారు. ఆటపాకలోని ఆయన కార్యాలయంలో జయమంగళ వెంకటరమణను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం వడ్డీ సంక్షేమ సంఘం నాయకులు ముంగర ప్రసాద్, నబిగారి రవిశంకర్, కృష్ణమూర్తి, బొర్రా సత్యనారాయణ, నబిగారి సూరిబాబు, సైదులు వెంకటరమణ, నబిగారి ఫణి అభినందనలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పేకాట శిబిరాలపై పోలీసులు ఆదివారం దాడిచేసి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను, నెక్కలం గొల్లగూడెంలో నంబర్ల ఆట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.4,150 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ తెలిపారు.

గుర్తతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని గొల్లగూడెం శ్రీకృష్ణుడి ఆలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, మూడు రోజుల నుంచి గ్రామంలో సంచరిస్తూ భిక్షాటన చేస్తున్నట్లు తెలిపారు. ఇతని ఆచూకీ కావాల్సిన వారు 9440796653 నెంబర్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

టిడిపితోనే అభివృద్ధి

ప్రజాశక్తి - కైకలూరు



టిడిపితోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఆచవరంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ గ్రామ అధ్యక్షులు తలారి చిన్న సీతారామయ్య, ఏకుల కిట్టయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పి.త్రినాధరాజు, వాణిజ్య భాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైడిమర్రి మాల్యాద్రి, ఏలూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు తాడినాడ బాబు, పి.రాధాకృష్ణ, రాజు, కలిశెట్టి శ్యాము, పడమట వాసు, వెంకటస్వామి, వీరబత్తిన సుధ పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధిని విస్మరించిన వైసిపి

ప్రజాశక్తి - ముసునూరు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో ఏ ఒక్క గ్రామంలోనూ కిలో మీటరు సిమెంట్ రోడ్డు వేయలేదని టిడిపి మండల అధ్యక్షులు దేవినేని ధలరామ్, రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగరామ్ పేర్కొన్నారు. ఆదివారం ముసునూరులో మండలంలోని 16 గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేసిన అభివృద్ధి ఏమిటో చూపాలన్నారు. ఇసుక, మట్టి ఆక్రమ రవాణా చేస్తూ డబ్బు దోచుకుంటున్నారని విమర్శించారు. పంచాయతీ నిధులు రూ.రెండ కోట్ల ఇరవై లక్షలు నేటి వరకు ఇసిలు ఇవ్వలేదని, అలాగే పంచాయితీలకు వచ్చే నిధులు కుడా దారి మళ్లిస్తున్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్ రుణాలు నిలిపివేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని అటవీ, పోరంబోకు భూములు ఎవరెవ్వరు ఆక్రమించుకున్నారో ప్రజలకు తెలుసున్నారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్షకు 570 మంది హాజరు

ప్రజాశక్తి - భీమడోలు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి పొలసానిపల్లి గురుకులం కేంద్రంగా ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని పరీక్షా కేంద్రం ముఖ్య పర్యవేక్షకులు, కళాశాల ప్రిన్సిపల్ ఎం.పద్మావతి తెలిపారు. పొలసానిపల్లి పరీక్షా కేంద్రంలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఉదయం నిర్వహించిన పరీక్షలకు 392 మందికి 340 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి 246 మందికి 230 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్ర పరిశీలకులుగా పెదవేగి గురుకులానికి చెందిన ఉపాధ్యాయులు టి.సత్యమూర్తి వ్యవహరించారన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పరీక్షకు హాజరైన విద్యార్థులతో పాటు వారి సహాయకులుగా వచ్చిన వారందరికీ పులిహోర, మజ్జిగ అందించామని, తాగునీటి సౌకర్యం కల్పించామని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు.

బొర్రంపాలెంలో నేడు భూ రీసర్వేపై గ్రామసభ

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో భూ రీ సర్వేపై సోమవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జెవి.సుబ్బారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ సభకు అధికారులతో పాటు స్థానిక రైతులు హాజరు కావాలని ఆయన సూచించారు. భూ రీ సర్వేపై రైతులకు సందేహాలు ఉంటే గ్రామసభలో నివృత్తి చేసుకోవాలని ఆయన తెలిపారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

నూజివీడు రూరల్: వాహనదారు లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని నూజివీడు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ హెచ్చరించారు. నూజివీడు-హనుమాన్ జంక్షన్ ప్రధాన రహదారిలో తుక్కులూరు వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లకు, వారి తల్లిదండ్రులకు ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ టి.రామకృష్ణ మాట్లాడుతూ వాహనదారులందరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని చెప్పారు. ద్విచక్రవాహనదారులందరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని చెప్పారు. వాహనదారులందరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రైతుల విరాళం

నూజివీడు రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి మండలంలోని పాత రావిచెర్ల నుంచి పది టన్నుల మామిడికాయలను ప్రత్యేక వాహనంలో రైతులు పంపారు. ఈ సందర్భంగా స్థానిక కోదండ రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

2 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఏలూరు టౌన్: స్థానిక వసంతమహల్ సెంటర్‌లోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో వచ్చేనెల రెండో తేదీ నుండి టైపు, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ పిఆర్ఓ పులి శ్రీరాములు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన, పరీక్షలు రాసినవారికి టైపు, డిసిఎ, డిటిపిలోనూ, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి టాలీలోనూ శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ నెల 24 నుండి సంస్థ కార్యాలయం వద్ద దరఖాస్తులు అందచేస్తారని తెలిపారు. ఏలూరు నగరం, పరిసర గ్రామాలకు చెందిన 35 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛభారత్

ఆగిరిపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఎన్.చంటిబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు పలు కేసుల్లో స్వాధీనపర్చుకున్న ద్విచక్ర వాహనాలను భద్రపరిచిన ప్రదేశాన్ని పరిశీలించి శుభ్రపరిచారు. రక్షణ నిమిత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.